# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## సంతోషంలో వెనుకబడ్డాం!

**భారతదేశానికి** ఓ పిడికెడు నవ్వులు కావాలి. ఓ దోసెడు సంతోషం కావాలి. బస్తాడు భరోసాను ప్రపంచ బ్యాంకు అరువియ్యగలదా? ఓ 150 కోట్ల నవ్వుల్ని ఐఎంఎఫ్ అప్పుగా ఇస్తుందా? అసలేం జరుగుతోంది? భారత్ ముఖానికి మళ్లీ చిరునవ్వులు అతికించేదెవ్వరు? మోదీ గద్దెనెక్కిన పదేండ్లలో మన సంతోషం చాలావరకు హరించుకుపోయింది. సంతోషమే సగం బలమన్నారు పెద్దలు. బలమే కాదు, ఆనందమే జీవిత మకరందమని కూడా చెప్పారు. ఎవరెన్ని చెప్తేనేం.. జీవితానికి అవసరమైన ఈ కీలకమైన ముడిసరుకు విషయంలో భారత్ చాలా వెనుకబడిపోయిందట. ప్రపంచ సంతోష సూచీ ఈ సంగతి వెల్లడించింది. ఇదేమంత సంతోషం కలిగించే వార్త కాదు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్ ఏటా ఈ సూచీని విడుదల చేస్తుంది. ఇదేమీ ఆషామాషీగా తయారు చేసే జాబితా కాదు. దీని వెనుక చాలా లెక్కలుంటాయి. బతుకుకు భరోసా కల్పించే పరిస్థితులను బట్టి సంతోష స్థాయిని అంచనా వేస్తారు. తలసరి జీడీపీ, ఆరోగ్యవంతమైన జీవితం, తోడునీడ లభ్యత, బోలెడన్ని జీవితావకాశాలు అందుబాటులో ఉండటం, ఔదార్యం, అవినీతి నుంచి విముక్తి అనే ఆరు ప్రధాన అంశాల ఆధారంగా ఈ సంతోషాన్ని లెక్కించి దేశాలవారీగా ర్యాంకులు ఇస్తారు.

ఈ సూచీలో ఫిన్లాండ్ అగ్రస్థానంలో ఉంది. ఈ ఉత్తర యూరప్ దేశం ఇలా టాప్‌లో నిలవడం వరుసగా ఇది ఏడోసారి. తర్వాతి స్థానాల్లో డెన్మార్క్, ఐస్‌ల్యాండ్, స్వీడన్ తదితర దేశాలున్నాయి. కొవిడ్-19 మహమ్మారికి ముందూ, తర్వాత తొలి పది దేశాల విషయంలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం. అగ్రరాజ్యంగా చలామణి అయ్యే అమెరికా ర్యాంకు 16 నుంచి 23కు పడిపోవడం, జర్మనీ ఆ తర్వాతి స్థానంలో సర్దుకోవడం ఆ రెండు దేశాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నదని తెలియజేస్తున్నది. అనునిత్యం ఘర్షణలతో, అల్లకల్లోలంగా కనిపించే ఇజ్రాయెల్ టాప్-10 దేశాల్లో ఉండటం ఆలోచించదగ్గ విషయమే. ఇక మన దేశం విషయానికి వస్తే 146 దేశాల్లో 126వ స్థానంలో ఉండటం ఏమంత గర్వకారణమైన విషయం కాదు. పొరుగు దేశమైన పాకిస్థాన్ 108వ ర్యాంకుతో మనకన్నా మెరుగ్గా, చైనా 60వ ర్యాంకుతో మనకన్నా చాలా ముందుగా ఉండటం విశేషం.

భారత్‌లో అందరి పరిస్థితి ఒకేలా చెప్పడానికి లేదు. రకరకాల సామాజిక అంతరాలు, సంతోషంలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. వయోభేదాలు, స్త్రీపురుష అసమానతలు, చదువులో అంతరాలు, సామాజిక కుల వివక్ష అనేవి సంతోష స్థాయిల్లో కూడా ప్రతిఫలించాయి. యువజనుల కన్నా వయోవృద్ధుల్లో సంతోష స్థాయి కొంచెం మెరుగ్గా ఉంది. ఆ వృద్ధుల్లోనూ మగవారి కంటే మహిళల్లో, చదువుకున్నవారి కంటే చదువురాని వారిలో, ఉన్నత కులాల కంటే ఎస్సీ, ఎస్టీల్లో సంతోషం తక్కువగా నమోదైంది. వయసు మీద పడుతున్న కొద్దీ స్త్రీపురుషుల మధ్య అగాధం పెరగడమనేది ప్రతిదేశంలోనూ కనిపించింది. భారత్‌లో ఇటు పిల్లలు, అటు వయోవృద్ధులు సాపేక్షంగా సంతోషంగా ఉన్నట్టు కనిపిస్తున్నప్పటికీ యువజనులు, ముఖ్యంగా అప్పుడే జీవిక కోసం అన్వేషించే వయసులో ఉన్న వారు సంతోషంగా లేకపోవడం దేనికి సంకేతం? వీరి విషయంలో మన దేశం ర్యాంకు మరో మెట్టు దిగి 127 వద్ద ఆగింది. అంటే యువతకు బతుకు భరోసా అంతంతమాత్రంగానే ఉందని ఇది సూచిస్తున్నది. రెండో విడత పరిపాలన పూర్తి చేసుకుని మూడో విడత కోసం అంగలు వేస్తున్న భారత పాలకులు దీని గురించి ఆలోచించాల్సిన అవసరముంది. ఆకలి సూచీలో వెనుకబడ్డప్పుడు అవన్నీ పశ్చిమ దేశాల కాకిలెక్కలని కొట్టిపారేసిన నాయకత్వం ఇప్పుడు అందుకు భిన్నంగా స్పందిస్తుందా?



## ఐదు నెలలుగా పస్తులే

నెలవంక దర్శనంతో ప్రపంచవ్యాప్తంగా గత సోమవారం రంజాన్ మాసం ప్రారంభమైంది. ఎంతో పవిత్రమైన ఈ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టి ముస్లింలు తమ భక్తిని చాటుకుంటున్నారు. అయితే గాజాలో మాత్రం ఎప్పుడో ఉపవాస దీక్షలు మొదలైపోయాయి. ఎందుకంటే, తిండే దొరక్క అల్లాడుతున్న అక్కడి ప్రజలు ఎప్పటినుంచో ఒక్కపూట తింటుండటమే అందుకు కారణం.



ఇస్కా రాజేష్‌బాబు
93973 99298

ఐదు నెలలుగా భీకర యుద్ధాన్ని ఎదుర్కొంటున్న గాజా ప్రజలు దయనీయమైన పరిస్థితుల్లో బతుకీడుస్తున్నారు. మానవతాసాయం కింద అందే ఆహారమే వారికి దిక్కవుతున్నది. ఇజ్రాయెల్ దాడులతో రంజాన్ మాసంలోనూ గాజా భూతల నరకాన్ని తలపిస్తోంది. శిథిలాల మధ్యే అక్కడి ప్రజలు ప్రార్థనలు చేస్తున్నారు. ఆహారం దొరకగానే ఓ యువతి ఎగిరి గంతేసిన దృశ్యం అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నది.

గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న బాంబు దాడులతో ఆ ప్రాంతంలోని వ్యవసాయ భూములు పూర్తిగా దెబ్బతిన్నాయి. బాంబుల మోతతో వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. మరోవైపు మానవతాసాయం కింద ఆహార పదార్థాలు తెస్తున్న ట్రక్కులు భద్రతా తనిఖీలు దాటుకొని గాజాలోకి వెళ్లడం కష్టతరంగా మారింది. దీంతో గాజాలోని సుమారు సగం జనాభా (11 లక్షలు) తమకు తెలియకుండానే ఉపవాసం చేస్తున్నారు. జూలై నాటికి మిగతా ప్రజలు కూడా ఈ క్షామాన్ని ఎదుర్కొంటారని ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేస్ క్లాసిఫికేషన్ (ఐపీసీ) నివేదించింది.

ఉత్తర గాజాలో ఆహార సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకున్నది. ఊపిరి సలపని యుద్ధంతో అక్కడి పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. ట్రక్కులను ఇజ్రాయెల్ అడ్డుకుంటుండటంతో వివిధ దేశాలు విమానాల ద్వారా ఆహార పదార్థాలను జారవిడుస్తున్నాయి. వాటి కోసం ప్రజలు ఎగబడుతున్నారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి వందల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికే యుద్ధం కారణంగా 31 వేల మందికి పైగా పౌరులు మరణించగా.. ఆహార సంక్షోభం కారణంగా మరికొంత మంది తనువు చాలిస్తున్నారు.

తీవ్రమైన ఆహార కొరత కారణంగా గాజా ప్రజలు కలుపు మొక్కలు తింటుండటం అక్కడి పరిస్థితికి నిదర్శనం. స్థానికంగా పెరిగే మాలో జాతి మొక్కలను వారు తిని ప్రాణాలను కాపాడుకుంటున్నట్టు తెలుస్తున్నది. పిల్లలకు వాటినే తినిపిస్తుండటం బాధాకరం. అమాయకులైన పసి పిల్లలు, మహిళలను బలి తీసుకుంటున్న ఈ యుద్ధానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది. వేల మందిని పొట్టనబెట్టుకున్న సమరాన్ని ఇప్పటికైనా ఆపాలి. ప్రపంచ దేశాలు అందుకు నడుం బిగించాలి. లేదంటే ప్రపంచ చరిత్రలో ఇది ఒక మాయని మచ్చగా మిగిలిపోవడం ఖాయం.

# అనుచితాలైన ఉచితాలు నష్టదాయకం

మన దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయ్యాయి. సాంకేతికంగా ఎంతో ఎదిగిన భారత్ సామాజికంగా ఇంకా స్వాతంత్య్రానికి పూర్వమున్న మనస్తత్వంతోనే ఉండటం విచారకరం. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజల నాడిని పట్టుకున్న ఇందిరాగాంధీ గరీబీ హటావో నినాదంతో 17 ఏండ్లు ఈ దేశాన్ని పాలించారు. జనాకర్షక పథకాలను ప్రకటించి సులభంగా గద్దెనెక్కవచ్చనే విషయాన్ని ఆమె నిరూపించారు. ఆమె బాటలోనే ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు పోటీపడుతూ ఉచితాలను ప్రకటిసూటిస్తున్నాయి. అధికారాన్ని చేపడుతున్నాయి. ఈ క్రమంలో ప్రతి పార్టీ సబ్సీడీలతో పాటు ఉచితాలను ప్రకటిస్తూ ప్రజలను వెర్రివాళ్లను చేసి ఉచితాల నాదస్వరం ఊదుతూనే ఉన్నాయి. ఎందుకంటే, నాదస్వరం ఆపిన క్షణాన బలైపోతామని వాటికి తెలుసు.



డాక్టర్ వీవీ రామారావు
98492 37663



అసలు ఉచితాలెందుకు? ఉచితాల వల్ల పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగై, కొన్నాళ్లకు దేశంలో పేదరికమనేదే ఉండదని రాజకీయ పార్టీలు, నేతల వాదన. కానీ, వాస్తవం వేరు. ఉచితాల వల్ల లబ్ధి పొందేది రాజకీయ పార్టీలే. ఉచితాలను ప్రకటించి అధికారం చేజిక్కించుకొని, ఏదో మొక్కుబడిగా కొన్ని తాయిలాలను ఆశ్రితులకు ఇచ్చి, చేతులెత్తేయటం పాలకులకు పరిపాటిగా మారిపోయింది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. ఐదేండ్లలో అన్ని హామీలు అమలుచేస్తామని చెప్పి తప్పించుకుంటారు. అసలు ఉచితాలకు నిధులెలా సమకూరుస్తారనే విషయాన్ని ఎక్కడా, ఎవరూ వెల్లడించరు. ఉచితాలకు ఇచ్చేందుకు వినియోగించే ప్రతి రూపాయి మనం చెల్లించే పన్నులేననేది అందరికీ విదితమే. అయినప్పటికీ వాటి కోసమే ప్రజలు వెంపర్లాడుతుండటం బాధాకరం.

పాశ్చాత్య దేశాల్లో ఎక్కడా ఇలాంటి నష్టపూరిత ఉచిత పథకాలు లేవు. కొవిడ్ మహమ్మారి సమయంలో ఉచితంగా రేషన్ ఇచ్చేందుకు బీజేపీ సర్కార్ పెట్రోల్ ధరలను అమాంతం పెంచేసింది. కర్ణాటకలో కరెంటు చార్జీలు, పెట్రోల్ ధరలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచింది ఉచితాల కోసమే. తమిళనాడు ప్రభుత్వం ఆస్తి పన్ను పెంచడానికి అదే కారణం. అయితే కొన్ని ఉచితాలు అవసరమే. ముఖ్యంగా విద్య, ఆరోగ్య సంరక్షణ కోసం ఇచ్చే ఉచితాలు దీర్ఘకాలంలో సమాజానికి ప్రయోజనం చేకూరుస్తాయి. అయితే కొన్ని ఉచితాలు మాత్రం ప్రజలను సోమరులను చేస్తాయి. 1955లో తమిళనాడు ప్రభుత్వం తొలిసారిగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. అది మంచి పథకమే. కానీ, ఉచిత చీరలు, కుక్కర్లు, వాషింగ్ మెషిన్లు, టెలివిజన్ సెట్లు మొదలైన వాగ్దానాలతో దివంగత ముఖ్యమంత్రి జయలలిత ప్రారంభించిన ఉచితాల సంస్కృతితో ఎటువంటి ప్రయోజనం ఉండదు.

> ఉచితాలను కొనసాగించాలంటే రాష్ట్ర సంపదను సృష్టించాలి. లేదంటే అభివృద్ధి పనులకు కేటాయించాల్సిన నిధులు ఉచితాలకు మళ్లిపోతాయి. తద్వారా అభివృద్ధి ఆగిపోయి, రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతాయి. 1960ల్లో అన్నపూర్ణగా ప్రశంసలందుకున్న పంజాబ్ ప్రస్తుతం దయనీయ స్థితిలో ఉన్నది. అందుకు ప్రధాన కారణం ఉచితాలే. ప్రస్తుతం ఆ రాష్ట్రానికి రూ.2.82 లక్షల కోట్ల అప్పు ఉన్నది. అందుకే అక్కడి ఆప్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేసింది.

ప్రతి మహిళకు నెలకు రూ.వెయ్యి, 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీలను అమలు చేయడానికి ఆప్ సర్కార్ ఆపసోపాలు పడుతున్నది. ఉచితాలపై హిందూ సేన ఉపాధ్యక్షుడు సూర్జిత్ సింగ్ యాదవ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తత్ఫలితంగా భారత ఎన్నికల కమిషన్‌కు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు కూడా జారీ చేసింది.

ఇక మన రాష్ట్రం విషయానికి వస్తే ఆరు గ్యారెంటీలంటూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని ఒకసారి పరిశీలిస్తే.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంచిదే కానీ, ఉచిత విద్యుత్తు వల్ల రాష్ట్ర ఖజానాపై ఎంత భారం పడుతుందో ఒకసారి ఆలోచించాలి. మనకు విద్యుత్తు ఉచితంగా లభించడం లేదు. పైగా డిమాండ్‌ను బట్టి పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నాం. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 అందించడమంటే మాటలు కాదు. సీలింగ్ లేకపోవడం వల్ల రైతుబంధు ద్వారా సంపన్నులు ఎక్కువగా లబ్ధి పొందారనే విమర్శ ఉన్నది. మరి రూ.2,500 ఎవరెవరికి ఇస్తారో చూడాలి.

పేదలను ఎలా ఆకర్షించాలో రాజకీయ పార్టీలకు బాగా తెలుసు. పేదరికం లేకుండా చేయడానికే ఉచితాలు ఇస్తున్నామని పాలకులు చెప్తున్నప్పటికీ.. పేదరికం పూర్తిగా తుడిచిపెట్టుకుపోకూడదనే పార్టీలు కోరుకుంటాయేమో! ఎందుకంటే, పేదరికమే లేకుంటే ఉచితాలు ఉండవు కదా, ఉచితాలే లేకపోతే పార్టీలకు ఓట్లు పడవు కదా. భారతీయులకున్న సమస్య ఏమిటంటే ప్రాథమిక ఆర్థిక పరిజ్ఞానం లేకపోవడం. ఉచితాలు దీర్ఘకాలంలో ప్రమాదకారిగా మారి, మన కొంపలనే ముంచుతాయని అర్థం చేసుకోలేకపోవడం. మన దేశ బడ్జెట్‌లో 24 శాతం వడ్డీలకు, 12 శాతం సబ్సిడీలకు, 12 శాతం రక్షణకు, 9 శాతం జీతభత్యాలకు, 7 శాతం పింఛన్లకు పోతున్నది. మిగతా ఖర్చులు ఉండనే ఉన్నాయి. అంతటితో ఖజానా ఖాళీ అయిపోతుంది. మరి ఉచితాలకు? అందుకే, తమను అధికార పీఠంపైకి ఎక్కించిన ఉచితాల కోసమే ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. ఆ భారాన్ని మనపై మోపుతున్నాయి.

> ఉచితాలు ఎంతో ప్రమాదకరం. ప్రతిదానికి ప్రభుత్వం మీదే ఆధారపడే పరిస్థితికి ఉచితాలు మనల్ని దిగజారుస్తాయి. ఉచితాలకు అలవాటు పడ్డవారు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడరు. దీనివల్ల ఉత్పాదకత తగ్గిపోయి, సామాజిక సమస్యలు పెరుగుతాయి. అదే సమయంలో ఉచితాల కారణంగా ఎన్నికల ప్రక్రియ దెబ్బతింటున్నది. తాయిలాలు ప్రకటించి రాజకీయ పార్టీలు ఓట్లను కొనుగోలు చేస్తుండటంతో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతున్నది.

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇస్తున్న హామీలను చూస్తుంటే కండ్లు బైర్లు కమ్ముతున్నాయి. ప్రతి పేద ఇంటికి రూ.లక్ష ఆర్థిక సాయం చేయడం వాటిలో ఒకటి. దేశంలోని 140 కోట్ల జనాభాలో 27 శాతానికి పైగా పేదలున్నారు. ఈ లెక్కన 37.8 కోట్ల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తున్నది. ఈ మొత్తం ఎంత ఉంటుందో ఊహించుకోండి. ఇలా ఏటా ఇంటికో రూ.లక్ష ఇస్తే.. పేదరికం పోదు సరికదా, మన దేశమే అత్యంత బీద దేశాల్లో ఒకటిగా మారిపోతుంది. సాయమనేది ఉత్పాదకత పెంచేలా ఉండాలి. వివిధ వృత్తులు చేసే కార్మికులకు వారికి అవసరమైన వస్తువులు ఇస్తే వారి జీవితాలు మెరుగుపడతాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ గతంలోనే చెప్పారు.

సంపన్న దేశాల్లో మన దేశంలో ఉన్నట్టుగా ఉచితాలు లేవు. ఆయా దేశాలు విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమానికే ప్రాధాన్యమిస్తాయి. కానీ, మన దేశంలో మాత్రం అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఉచితాలను ప్రకటించడం శోచనీయం. వీటి కోసం ఉపయోగించే నిధులను ఉపాధి కల్పనకు, ప్రాజెక్టుల నిర్మాణానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు, రైతులకు ప్రోత్సాహకాలు అందించడానికి వినియోగిస్తే నిస్సందేహంగా సామాజిక అభ్యున్నతి, ఆర్థిక పురోగతి సాధ్యపడుతుంది.

(రచయిత: రాజకీయ, సామాజిక విశ్లేషకుడు)

భ్రమలన్నీ తొలగిపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం బట్టబయలవుతున్నది. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మొండిచెయ్యి చూపిస్తున్నారు. తన సొంత సామాజికవర్గ పక్షపాతిగా వ్యవహరిస్తూ తానెంటో నిరూపించుకుంటున్నారు. బీసీ కులగణన ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని ఓ వైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ న్యాయ్ జోడో యాత్రలో చెప్తూ బీసీల ఓట్ల కోసం ప్రయత్నిస్తుంటే.. రాష్ట్రంలో మాత్రం రేవంత్‌రెడ్డి అందుకు భిన్నంగా రహస్య ఎజెండాను ముందుకు తీసుకెళ్తున్నారు.

# ఇదేనా సామాజిక న్యాయం?



నక్కా మహేశ్ యాదవ్



రేవంత్‌రెడ్డి గతంలో ఏదైతే చెప్పారో సరిగ్గా వాటినే ఇప్పుడు అమలు చేస్తూ బీసీల హక్కులను కాలరాస్తున్నారు. 'రెడ్లకే పాలించే సామర్థ్యం ఉంటుంది. బీసీలకు పాలన గురించి ఏమాత్రం తెలియదు' అని పేర్కొని గతంలో బీసీల ఆత్మగౌరవంపై దాడి చేసిన ఆయన సీఎంగా ప్రస్తుతం సరిగ్గా అదే ఆచరిస్తున్నారు.

పరిపాలన విభాగంలో సొంత సామాజికవర్గానికి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తుండటంపై బీసీ, ఎస్సీ, ఎస్టీ మేధావులు ముక్కున వేలేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో బీసీ వర్గానికి చెందిన ఒక్కరికీ ఆయన అవకాశం కల్పించలేదు. పార్టీలో పదవులు మొదలు అడ్మినిస్ట్రేషన్ విభాగం వరకు అన్నింటిలోనూ రెడ్లకే అధిక ప్రాధాన్యం ఇచ్చి సామాజిక న్యాయాన్ని ఆయన తుంగలో తొక్కారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇంటెలిజెన్స్ అధిపతి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రెస్ అకాడమీ చైర్మన్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్, నగర పోలీసు కమిషనర్లు, పీఆర్వోలు.. ఇలా కీలకమైన విభాగాల్లో సొంత సామాజికవర్గం వారినే సీఎం నియమించుకున్నారు. పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు మహేందర్‌రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు చేసిన రేవంత్.. ఇప్పుడు ఆయన్నే టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా నియమించడాన్ని బట్టి ఆయనకున్న కులప్రీతిని అర్థం చేసుకోవచ్చు. కులాధిపత్య సామ్రాజ్య విస్తరణ కోసం, ప్రత్యేక ఎజెండా ప్రకారమే రేవంత్‌రెడ్డి ఇలా చేస్తున్నారనేది సుస్పష్టం.

వివిధ విభాగాల్లో రెడ్లకు ప్రాధాన్యం ఇస్తుండటంపై వ్యతిరేకత వస్తున్నప్పటికీ ఆయన తీరు మార్చుకోవడం లేదు. పైగా ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్ల నియామకాల్లోనూ బీసీలకు, ఎస్సీలకు మొండిచెయ్యి చూపారు. 37 కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించగా.. అందులో 10 శాతం జనాభా లేని ఒక్క సామాజికవర్గానికే 19 చైర్మన్ పదవులు కట్టబెట్టారు. 52 శాతం ఉన్న బీసీ సామాజికవర్గానికి 11 చైర్మన్ పోస్టులే దక్కాయి. ఇక దళిత సామాజికవర్గానికి ఒకే ఒక్క చైర్మన్ పదవిని ఇచ్చారు. అది కూడా ఎస్సీ కార్పొరేషన్ కావడం గమనార్హం. మరో కార్పొరేషన్ అయితే దాన్ని కూడా రెడ్లతో భర్తీ చేసే వారేమో! ఇలా బీసీ సామాజికవర్గాన్ని రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నా.. బీసీ సంఘాలు నోరు మెదపకపోవడం విచారకరం.

సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్‌కు ఓటేయాలని ఎన్నికల్లో ప్రచారం చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మేధావులు కూడా రేవంత్‌రెడ్డి తీరుపై స్పందించడం లేదు. ఇదేనా సామాజిక న్యాయమని ఒక్కరూ ప్రశ్నించడం లేదు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో బీసీల ఉద్ధరణకు ఎలాంటి ముందడుగు పడినట్టుగా కనిపించడం లేదు.

> కులగణన చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసిన కాంగ్రెస్.. విధివిధానాల ప్రకటనలోనే తన చిత్తశుద్ధి ఏంటో నిరూపించుకున్నది. బీసీల కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించి.. బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లు కేటాయించిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కారుది.


ఓయూ బీసీ విద్యార్థి లోకాన్ని కూడా కాంగ్రెస్ మోసం చేసింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును కాంగ్రెస్ వైపు మళ్లించిన ఓయూ విద్యార్థి నేతల కృషిని వాడుకొని గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి.. వారిలో ఒక్కరికైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారా? రేవంత్‌కు ఓయూ విద్యార్థులంటే అడ్డా మీద కూలీలతో సమానం. అందుకే వారికి పదవులు ఇవ్వలేదు. ఇకనైనా ఓయూ విద్యార్థులు కాంగ్రెస్‌ను, రేవంత్‌ను పల్లకిలో మోయడం మానేసి.. కులాధిపత్య రాజకీయాలపై ఉద్యమాన్ని నిర్మించడంపై దృష్టి సారించాలి. తెలంగాణ ఉద్యమం తరహాలో స్వతంత్రంగా ఉద్యమ నిర్మాణం కోసం కృషి చేయడం తప్పితే.. ఓయూ అస్తిత్వానికైనా, బీసీ ఉద్యమానికి అయినా మరో మార్గం లేదు.

తెలంగాణలో దళితోద్యమం, విప్లవోద్యమం వచ్చాయి. ఇప్పుడు రావాల్సిందల్లా బీసీ ఉద్యమమే. అవమానం, అణచివేతతో తిరుగుబాటు జెండాను ఎగురవేసే ఓ చక్కని అవకాశాన్ని రేవంత్‌రెడ్డి బీసీలకు ఇచ్చారు. ఈ సమయాన్ని బీసీలు సరిగ్గా వాడుకుంటే.. రేవంత్ నిర్మిస్తున్న కులాధిపత్య రాజ్య స్థాపనను ధ్వంసం చేసి బీసీ జెండాను ఎగురవేయడం ఖాయం. అదే జరిగితే దేశానికి తెలంగాణ మళ్లీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.





## నీరే ఆధారం!

ఎర్రటి ఎండల్లో నెర్రెలు బారిన
నేలల్లో వలసల్లా సాగుతోన్న దాహం!
నెత్తిన ఖాళీ బిందెలతో దూరాలు
తగ్గించేసినా చెమటల్లో తప్ప నీటిని
నిజంగా చూడలేని నిస్సహాయత
ఒక్క చెలమ చెలిమి లేని ఒంటరి
ఇసుక దారుల్లో కన్నీటి పొరల్లోంచే
కానరాని నీటి జాడ కోసం అన్వేషణ!
చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు..
అమృతధారల్లాంటి వర్షపు నీళ్లు
నేలపాలైన గాజు ప్రతిమలా వెక్కిరిస్తుంటే
ఆ ముత్యపు బిందువుల్ని గుదిగుచ్చి
భద్రంగా దాచుకోలేని నిర్లక్ష్య ఫలమిది
నదుల ఊపిరి తీసేలా ప్రవాహ దారుల్ని
కాచి రిసార్టుల్ని గుండెలపై అదిమేసి
నదీమ తల్లిని ఎముకల గూడు చేసి
అడవుల్లో ఆటవిక రాజ్యం స్థాపించి
పచ్చదనాన్ని నల్లధనంగా మార్చేసి
నేలతల్లి గుండెల్లోకి ఎండిన బోర్లేసి
భూగర్భ జలాలకు గర్భశోకం తెచ్చిపెట్టి
అవినీతి సంపాదనకే పథకాలు తప్ప
సాగునీటికి తాగునీటికి ప్రణాళికలు
లేని దూరదృష్టిరాహిత్యపు దురదృష్టాల్ని
వెంటేసుకొని ఎండిన బావుల చుట్టూ
ఆవురావురుమని మూగే కాకులమయ్యాం!
ఖాళీ బిందెలు బీళ్లు పడిన నేలలు
ఎండిన గొంతుకలతో పాడిపంటలు కరవై
ఎడారి కష్టాలై తడారిన బతుకులయ్యాయి
పరిసరాలు ఎండి గుండె తడి ఆవిరయ్యాక
ఇకనైనా మనం కళ్లు తెరవాలి తప్పదు!
ప్రతి నీటి బిందువు సాక్షాత్తూ అమృత
బిందువేనని గుర్తించి నీటిని పూజించాలి!



భీమవరపు పురుషోత్తమ్
99498 00253




## మానవాళికే శత్రువులు

రాబోయే ఎన్నికల్లో మనం ఎదుర్కోబోయే శత్రువులు మన రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే కాదు. వారు భారతదేశానికి, భారత రాజ్యాంగానికి శత్రువులు. సమైక్యతకు, సమగ్రతకు, బహుళత్వానికి, లౌకికవాదానికి, సమాఖ్యవాదానికి కూడా శత్రువులు. ఒక్కమాటలో చెప్పాలంటే.. మొత్తం మానవాళికే శత్రువులు.

\- ఎంకే స్టాలిన్,
తమిళనాడు ముఖ్యమంత్రి